బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవిందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, రాజేందర్‌రెడ్డి తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ అన్నారు. ఝరాసంగం మండల కేంద్రంలో గురువారం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్‌పాటిల్ ఆధ్వర్యంలో ఈదులపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ వార్డుసభ్యులు బండి సునీల్, నాగరాజు పాటిల్, గొల్ల గోపాల్ యాదవ్‌తో పాటు పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తా

సదాశివపేట(సంగారెడ్డి): భగవంతుని ఆశీస్సులు, నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదాలతో సంగారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం నామినేషన్ వేయడానికి వెళ్తూ పట్టణంలోని అయ్యప్ప మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప గురుస్వాములు ఆయనను ఘనంగా సన్మానించారు.

పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలి

జోగిపేట(అందోల్): పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాని అందోల్ జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. స్వచ్ దీపావళి–శుభ దీపావళి ప్రచార కార్యక్రమంలో భాగంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది జోగిపేటలోని భగత్‌సింగ్ రోడ్డులో మట్టి ప్రమిదలతో దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, మెప్మా టీఎంసీ భిక్షపతిగౌడ్, ఆర్‌ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



మట్టి ప్రమిదలతో దీపాలను వెలిగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నియోజకవర్గ ప్రజలే నా ఊపిరి

- ఉప్పెనలా కదిలిన బీఆర్ఎస్ దండు
- హనుమాన్, గణేశ్‌గడ్డ సిద్ధివినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- గులాబీసైన్యంతో భారీ వాహన ర్యాలీ
- పార్టీ శ్రేణుల మధ్య ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు

పటాన్‌చెరు: ఎటుచూసినా దారులన్నీ గులాబీమయంగా మారాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా గురువారం వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబసభ్యులతో కలిసి మొదటగా పంచముఖి, చైతన్యబస్తీలోని హనుమాన్ ఆలయాలతో పాటు ప్రసిద్ధిగాంచిన గణేష్‌గడ్డ సిద్ధి వినాయక ఆలయాన్ని దర్శించుకొని నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సపనదేవ్, శంకర్‌యాదవ్, ప్రజాప్రతినిధులు, గులాబీసైన్యంతో కలిసి లక్డారం, ఇస్నాపూర్ ముత్తంగి మీదుగా పటాన్‌చెరు వరకు భారీ ర్యాలీ నిర్వహించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా సమక్షంలో మహిపాల్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన

పటాన్‌చెరు టౌన్: అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందించామని, సీఎం కేసీఆర్ ఆశీస్సులు, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల మద్దతుతో మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.9వేల కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వివరించారు. ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకతతో గడపగడపకూ అందిస్తున్నామని తెలిపారు. శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, సపానదేవ్, మాజీ ఎంపీపీ యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలోని కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్ల సంఘానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన కేబుల్ ఆపరేటర్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉండే కేబుల్ ఆపరేటర్లు బీఆర్ఎస్‌కు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఆ సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

మరోసారి ఆశీర్వదించండి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తనని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఐజీ కాలనీలో రాష్ట్ర కాపు సంఘం నాయకులు అరవ రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాపు సంఘం సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో కాపు సామాజికవర్గం సంఘానికి స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ బాలాజీ, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, ఆదర్శ్‌రెడ్డి, కాపు సంఘం నాయకులు సమ్మెట ప్రసాద్, పరమేశ్వరరావు, రావులపల్లి రమేష్, నాగమోహన్‌రావు, కృష్ణారావు, శంకర్‌రావు, నరేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నాయకుల మద్దతు

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా జిన్నారం మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. రాష్ట్ర నాయకులు వెంకటేశ్ గౌడ్, నాయకులు బోజిరెడ్డి, నర్సింహ, నీలం మోహన్ ముదిరాజ్, సంఘం నాయకులు వెంకటేష్, నీలం సత్యనారాయణ, వరుణ్‌చందు ఆంజనేయులు, భాను పాల్గొన్నారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి



భారీర్యాలీతో ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయానికి వస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి



గణేష్‌గడ్డ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



ఎమ్మెల్యేకు మద్దతు ప్రకటిస్తున్న జిన్నారం మదిరాజ్ సంఘం నాయకులు

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా పాండురంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని వాణీశ్రీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌లో చేరిన యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కారు గుర్తుపై ఓటు వేసి మహిపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్పనఉపేందర్‌రెడ్డి, అమీన్‌పూర్ బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ దేవేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పుతున్న తుమ్మల పాండురంగారెడ్డి

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ భాష్యం స్కూల్ సెక్యూరిటీ గార్డ్ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన రితీష్ పాండే(19) బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు వచ్చి భాష్యం స్కూల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 6న నైట్‌డ్యూటీకి వెళ్లాడు. తిరిగి ఏడో తేదీ తెల్లవారుజామున బాస్కెట్ బాల్ కోర్టు రింగును పట్టుకుని వ్యాయామం చేస్తుండగా బోల్టు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అమీర్‌పేట్ వెల్నెస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి గురువారం మృతుడి సోదరుడు సంతోష్ పాండే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవతామూర్తులకు దామోదర పూజలు

మునిపల్లి(అందోల్): అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర రాజనర్సింహ దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా దామోదర జీవన్ముక్త సంస్థానంలోనే నామినేషన్‌పై సంతకాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవుని ఆశీర్వాదం, ప్రజల దీవెనలతో ఎమ్మెల్యేగా గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు బుదేరా రాజేశ్వర్‌రావు, తాటిపల్లి రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ అసత్ పటేల్, పెద్దగోపులారం ఎంపీటీసీ పాండు తదితరులు ఉన్నారు.

చల్లని దీవెనలతో ఆశీర్వదించండి

- సీఎం సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- సంక్షేమ పథకాలే మరోసారి గెలిపిస్తాయి
- ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు ధీమా
- కాలినడకన వెళ్లి నామినేషన్ దాఖలు

జహీరాబాద్: మీ చల్లని దీవెనలతో మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు అన్నారు. నామినేషన్ దాఖలు చేసేందుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కాలినడకన వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్ బెడ్‌రూం ఇళ్లు తదితర పథకాలను ప్రవేశపెట్టి అన్నివర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పథకాలే తనను మరోసారి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఎస్ఎన్ఎల్ సభ్యుడు శంకర్‌నాయక్, నాయకులు మంకాల్ సుభాష్, అల్లాడి నర్సింహులు, కిషన్‌రావు పవార్, రామకృష్ణారెడ్డి, పెంటారెడ్డి, తంజీం, విజయ్‌మోహన్‌రెడ్డి, కుత్‌బుద్దీన్, నర్సింహులుయాదవ్, నరేష్, జహంగీర్, అనుషమ్మ, భాస్కర్, వెంకటేశం, రవీందర్, తట్టు నారాయణ, యూనూస్ పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని న్యామతాబాద్ గ్రామంలో వెలసిన వీరభద్రేశ్వర ఆలయంలో పూజలు జహీరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం టీఆర్ఎస్ శ్రేణులతో కలిసి జహీరాబాద్‌కు తరలివెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవిందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ గౌసో ద్దీన్, నాయకులు వీరారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్, ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, జగనాథ్‌రెడ్డి, గొల్ల వీరేశం, రాజుపటేల్ పాల్గొన్నారు.



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు



ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం వద్ద నాయకులతో మాట్లాడుతున్న మాణిక్‌రావు



మాణిక్‌రావును సన్మానిస్తున్న వీరభద్రేశ్వర ఆలయ అర్చకులు, నాయకులు

కోహీర్ మండలాన్ని అభివృద్ధి చేస్తా

కోహీర్(జహీరాబాద్): మండలాన్ని అన్ని విధాలుగా భివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మండల పరిధిలోని దిగ్వాల్, చింతలగట్టు, కొత్తూర్(డి) గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే తనను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు నర్సింహులు, రామకృష్ణారెడ్డి, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



కోహీర్: దిగ్వాల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు

కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రుక్మాపూర్, రుక్మాపూర్ తండాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి తదితరులు రుక్మాపూర్ గ్రామంతో పాటు సమీపంలోని తండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌ను గెలుపించాలని ఓటర్లను కోరారు.

సదాశివపేటలో..

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గారెడ్డి గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డి సదాశివపేట పట్టణంలోని 18వ వార్డులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, కౌన్సిలర్ కోవూరి లక్ష్మి ప్రసన్నశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిపాల్‌రెడ్డిని గెలిపించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డిని గెలిపించాలని మాజీ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహిపాల్‌రెడ్డి నామినేషన్ వేయనున్న సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పటాన్‌చెరుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్, సింధుఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా గురువారం రామచంద్రాపురం పట్టణంలోని మల్లన్నస్వామి ఆలయంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్ యాదవ్, నరసింహ, శ్రవణ్, కృష్ణకాంత్, రవి, అబ్బు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కారు తనిఖీ

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బోరపట్ల నుంచి నర్సాపూర్ వెళ్తుండగా దౌల్తాబాద్ చెక్ పోస్ట్ వద్ద ఆయన కారును పోలీసులు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కారును ఆపి పోలీసులకు సహకరించారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.లక్ష పోగొట్టుకోగా మరో ఘటనలో పాన్‌కార్డ్ అప్డేట్ అంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించి మోసపోయిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని భ్రమరాంభ మల్లికార్జున కాలనీకి చెందిన ఓ వ్యక్తికి సెప్టెంబర్ 14న పార్ట్‌టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇవ్వగా ముందుగా రూ.1000 చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.లక్ష చెల్లించాడు. టాస్కులు పూర్తి చేసిన అనంతరం ఉద్యోగి తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించ లేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాన్‌కార్డు అప్‌డేట్ చేయాలంటూ మోసం...

అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి అక్టోబర్ 7న తన ఫోన్‌కు బ్యాంకు ఖాతాకు పాన్‌కార్డు అప్‌డేట్ చేయాలని లింగ్ క్లిక్ చేసి అప్‌డేట్ చేయాలంటూ వచ్చిన మెసేజ్‌కు బాధితుడు స్పందించాడు. దీంతో తన వివరాలను నమోదు చేసి అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా చేసి బాధితుడు రూ.1,11,000 పోగొట్టుకొని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి గురువారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

పటాన్‌చెరు టౌన్: 910 గ్రాముల గంజాయిని పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ సీతారామరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామంలో ఓ ఇంట్లో గంజాయిని విక్రయిస్తున్న నితిన్‌కుమార్ అనే సెక్యూరిటీ గార్డ్‌ను అదుపులోకి తీసుకుని 910 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు...

పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఇద్దరిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గర్భిణి మృతి

పటాన్‌చెరు టౌన్: 8 నెలల గర్భిణి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని బీడీఎల్ భానూర్‌కు చెందిన సంతోష్‌రెడ్డి రెండేళ్ల క్రితం భార్యను తీసుకొని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అయితే సంతోష్‌రెడ్డి తన భార్య సంతోషి ప్రియ(31)కు పిల్లల కోసం మదినగూడలో ఐవీఎఫ్ ట్రీట్‌మెంట్ చేయించాడు. కవల పిల్లలతో ఉన్న 8 నెలల గర్భిణి సంతోషి ప్రియకు గురువారం భర్త డ్యూటీకి వెళ్లాక ఇంట్లో ఒంటరిగా ఉన్న సంతోషిప్రియకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో జహీరాబాద్‌లో ఉండే తండ్రి వెంకట్‌రామిరెడ్డికి సమాచారం ఇచ్చింది. దీంతో ఆమె తండ్రి వెంటనే మదినగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో మృతురాలి తండ్రి వెంకటరామిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ

ఒకరు మృతి, 8 మందికి గాయాలు

వట్‌పల్లి(అందోల్): ఆటో, బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఎనిమిది మందికి గాయాలైన ఘటన అందోల్ మండల పరిధిలోని రాంసాన్‌పల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహా నామినేషన్ సందర్భంగా అల్లాదుర్గ్ మండలం గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన పలువురు ఆటోలో జోగిపేటకు వచ్చి నామినేషన్ కార్యక్రమం పాల్గొన్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో రాంసాన్‌పల్లి సమీపానికి రాగానే నారాయణఖేడ్ వైపు నుంచి ఎదురుగా వస్తున్న హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, ఆటో బలంగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో దుర్గమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి కాళ్లు విరగాయి. మిగతా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలు కుమారుడు కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పశువులపై చిరుత దాడి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రం సమీపంలో చిరుతపులి గురువారం మరోసారి ప్రత్యక్షమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్గాపూర్ గ్రామానికి చెందిన రైతు ఏసుకు సంబంధించిన వ్యవసాయ పొలం వద్ద షెడ్డులో ఎప్పటిలాగే పశువులను కట్టివేశాడు. ఈ క్రమంలో పశువులపై చిరుత దాడి చేసి లేగదూడను చంపింది. సర్పంచ్ జంగం స్వప్న, అటవీశాఖ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత సంచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

కొండాపూర్(సంగారెడ్డి): మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం మారేపల్లిలో చోటుచేసుకుంది. సీఐ చంద్రయ్య తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మారెపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నరసింహగౌడ్, తుల్జమ్మ దంపతులకు మరేపల్లి శివారులో మూడున్నర ఎకరాల భూమి ఉంది. అయితే రెండున్నర ఎకరాల భూమి అమ్మి తన కుమారుడు, కూతురు పెళ్లిలు చేశారు. మిగిలిన ఒక ఎకరా భూమిని కౌలుకు ఇచ్చాడు. భూమి తమ పేరుపై చేయాలని కుమారుడు సాయికుమార్‌గౌడ్, మంజుల నిత్యం కొట్లాడుతుండడంతో రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మునిపల్లి మండలం అంతారం గ్రామానికి వలసవెళ్లారు. అక్కడ కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం అక్కడి నుంచి సామాను సర్దుకొని మారేపల్లికి వచ్చారు. గురువారం మళ్లీ కోడలు, అత్తకు మధ్య భూమి విషయంపై గొడవ జరుగుతుండడంతో నర్సింహులుగౌడ్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి మధ్యాహ్నం 1 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తుల్జమ్మ విగతజీవిగా పడి ఉండటంతో తుల్జమ్మ మృతిపై కోడలు మంజులపై అనుమానం ఉన్నట్లు మృతురాలి భర్త నర్సింహులుగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



విద్యుదాఘాతంతో ఆవు మృతి

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుత్ స్తంభం నుంచి వైరు తెగిపోయి ఆవుపై పడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన గుమ్మడిదలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మునిగళ్ల బీరప్పకు చెందిన ఆవు ఎప్పటిలాగే మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు బీరప్ప కోరాడు.